సస్యరక్షణతో అధిక దిగుబడులు

నారుమడులు మునిగిన
రైతులు పాటించాలని అధికారుల సూచన


వరినాట్లు వేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఖరీఫ్ సాగులో వరి నాట్లు వేసే సమయంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా ఈ సమయానికే వరినాట్లు ప్రక్రియ రైతులు పూర్తి చేసే వారు. అయితే ఈ ఏడాది అధిక వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో వరదలు కారణంగా నారుమడులు ముంపునకు గురయ్యాయి. అందువల్ల ఈ ఏడాది వరినాట్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. అయితే ప్రస్తుతం వరినాట్ల సమయంలో రైతులు అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ముంపు బారిన పడని ప్రాంతాల్లో ప్రస్తుతం ఆకుమడుల్లో నీటి శాతం సమృద్ధిగా ఉండాలని సూచిస్తున్నారు. అలాగే మూనలు నాటే సమయంలోనే తగు జాగ్రత్తలు తీసుకుంటే వరి పైరు చీడ పీడల బారిన పడకుండా ఉండేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. మూనలు వేసేందుకు రెండు వారాలు ముందుగా పొలాన్ని దమ్ము చేసి వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకోవాలని వివరిస్తున్నారు.

సస్యరక్షణ ఇలా

నారుమడిలో నుంచి వరి నారు సేకరించేందుకు వారం రోజుల ముందుగా సెంటు నారుమడికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 160 గ్రాములు తప్పనిసరిగా వేయాలి. వరికోత యంత్రంతో కోయడం వల్ల వాటి ద్వారా వచ్చిన గడ్డి పోగులు నాట్లు వేసే సమయానికి చీకి కుళ్లకపోవడంతో తరువాత పంటలో మూనలు త్వరగా తయారు కావు. అందువల్ల వరిచేలో చేసే దమ్ముకు, దమ్ముకు మధ్య రెండు వారాల వ్యత్యాసం ఉండాలి. వరికి భాస్వరం ఎరువు ఎకరానికి 225 కిలోలు, యూరియా 155 కిలోలు , పొటాష్ 40 కిలోలు వేసుకోవాలి. ఎరువులు వేసిన 48 గంటల తరువాత ఎకరానికి 40 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. నాట్లు నుంచి ఆరు ఆకులతో ఉన్న ఆరోగ్యవంతమైన వరి నారును 2 నుంచి 3 సెంటీ మీటర్ల లోతున నాటుకోవాలి. నాట్లు వేసే సమయంలో నీరు తక్కువగా ఉంచుకోవడం ఉత్తమం. వరి నాట్లు లోతుగా వేయడం వల్ల పిలకలు తక్కువగా వస్తాయి. నాట్లు వేసిన ఐదారు రోజుల్లో తప్పనిసరిగా కలుపు మందులు వాడాలి. ఫెడరో సల్ఫ్యూరాన్ ఇథైల్ 80 నుంచి 100 గ్రాములు ఎకరానికి లేదా ఆక్సీ డయార్జిల్ 30 నుంచి 40 గ్రాములు 20 కిలోల ఇసుకతో కలిపి పొలంలో చల్లాలి. చల్లిన 24 గంటల వరకు చేలల్లో నీరు బయటకు రాకుండా చూసుకోవాలి. రసాయన ఎరువులు వేసే సమయంలో నీరు లేకుండా బురద పదునులో వేసుకోవాలని అధికారుల సూచిస్తున్నారు.

వెదజల్లే విధానం

ప్రస్తుత తరుణంలో వరదలు, అధిక వర్షాల కారణంగా ఇప్పటికే సార్వా పంటకు సంబంధించి నాట్లు వేయడంతో జాప్యం కలిగిన నేపథ్యంలో మెరక చేలల్లో వెదజల్లే విధానాన్ని అవలంబిస్తే మంచిది. వెద జల్లే విధానంలో వరి విత్తనాలు చల్లిన 3 నుంచి 5 రోజులకు 10 లీటర్ల నీటికి 75 మిల్లీలీటర్ల బెంథియోకార్బ్ లేదా 80 మిల్లీ లీటర్ల బుటాక్లోర్ కలిపి నారుమడిలో పిచికారీ చేస్తే ఊద వంటి కలుపును నిర్మూలించవచ్చు. కలుపు మందు పిచికారీ చేసేటప్పుడు మడిలో నీటిని తీసి వేయాలి. కలుపు ఎక్కువగా ఉంటే విత్తనాలు చల్లిన 15వ రోజున 10 లీటర్ల నీటిలో 20 మిల్లీలీటర్ల చొప్పున సైహలోఫాస్ బ్యూటైల్ కలిపి పిచికారీ చేయాలి. కలుపు మందు వాడేప్పుడు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సూచిస్తున్నారు.

చీడపీడల రక్షణ చర్యలు

విత్తనాలు చల్లిన 12–14 రోజుల తరువాత ఆకులపై మొవ్వ పురుగు గుడ్లు కన్పించినా లేదా ఉల్లి కోడు , తాటాకు పురుగు, తామర పురుగు కనిపించినా లీటరు నీటికి 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2.5 మిల్లీ లీటర్ల క్లోరిఫైరీఫాస్ లేదా 2 మిల్లీ లీటర్ల క్వినాల్‌ఫాస్ కలిపి పిచికారీ చేయాలి. నారు తీయడానికి వారం ముందు 800 గ్రాముల కార్బోఫ్యూరాన్–3జీ గుళికలు లేదా 250 గ్రాముల ఫోరేట్ 10 జీ గుళికలు వేస్తే మొవ్వ పురుగు , ఉల్లికోడును అరికట్టవచ్చు. పొడ, కాండం కళ్ల తెగుళ్ల నుంచి కాపాడుకోవాలంటే పరిసరాలను కలుపు లేకుండా చూసుకోవాలని అధికారులు వివరిస్తున్నారు.

క్లుప్తంగా

నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్‌గా మధుబాబు


మధుబాబు

నరసాపురం: నరసాపురం రైల్వేస్టేషన్ మేనేజర్‌గా మధుబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. భీమవరం రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న దివాకర్ ఉద్యోగ విరమణ చేశారు. ఇదిలా ఉంటే మధుబాబు గతంలో నాలుగేళ్ల పాటు నరసాపురం స్టేషన్ మేనేజర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ స్టేషన్ నిర్వహణలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పనిచేస్తానని చెప్పారు.

ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపు తగ్గింపు తగదు


ఎమ్మెల్యే నాయకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: ప్రభుత్వం వైద్యుల పీజీ ప్రవేశాల్లో ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ–85 గురించి ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతూ ఎమ్మెల్యే నాయకర్‌కు వినతి పత్రం అందజేశారు. నరసాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు బుధవారం ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రంజిత్, అనిల్, మాధురి, లక్ష్మీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అల్లు రామలింగయ్యకు ఘన నివాళి


అల్లు రామలింగయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న చిరు ఫ్యాన్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సినీ రంగం తొలిరోజుల్లోనే పాలకొల్లు నాటక రంగం నుంచి సినీ పరిశ్రమలో అడుగుపెట్టి పాలకొల్లు కీర్తి పతాకాన్ని దశదిశలా వ్యాపింపచేసిన వ్యక్తి అల్లు రామలింగయ్య అని రాష్ట్ర చిరు ఫ్యాన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం అల్లు రామలింగయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక చిన్నకార్ల స్టాండ్ వద్ద ఉన్న అల్లు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంగంతో పాటు స్వాతంత్ర సమరయోధుడిగా, హోమియోపతి వైద్యుడిగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో చిరు ఫ్యాన్స్ సభ్యులు శిడగం సురేంద్ర, బిట్రా లక్ష్మీనారాయణ, మద్దాల గణేష్, ముచ్చర్ల రమేష్, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టిన లారీ


జాతీయ రహదారిపై విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టన లారీ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం పరిధిలో 165వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి లారీ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలివి..భీమవరం నుంచి ఉండి వైపుగా వస్తున్న లారీ ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి హైటెన్షన్ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగి క్రింద పడిపోవడంతో ఒక్కసారిగా వైర్ల నుంచి మంటలు రేగాయి. ఇది గమనించిన వాహనదారులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్‌ను నిలిపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

చోరీ యత్నం

భీమవరం: ఒకటో పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంటి తాళాలను దొంగలు పగలగొట్టి దొంగతనానికి యత్నించిన సంఘటన ఇది. ఏఎస్సై దేవరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉంటున్న నాదు శేషగిరిరావు కుటుంబ సభ్యులు జూన్ 8న బెంగళూరు వెళ్లారు. తాళాలు వేసిన ఇంటి ఆవరణను పని మనిషి వెళ్లి శుభ్రం చేస్తుంటారు. బుధవారం ఉదయం వెళ్లేసరికి తాళాలు పగలగొట్టి వస్తువులు విసిరేసి ఉన్నాయి. శేషగిరిరావు బంధువు నల్లం లోకనాధరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రమాదకరంగా నిద్రగన్నేరు చెట్టు


ఎస్.ఇల్లిందలపర్రువద్ద రోడ్డు మార్జిన్‌లో ప్రమాదకరంగా ఉన్న నిద్రగన్నేరు చెట్టు

పెనుమంత్ర: స్థానిక వేల్పూరు–జుత్తిగ ప్రధాన రహదారిలో సోమరాజు ఇల్లిందలపర్రు మల్లిపూడి సరిహద్దులో ఆర్అండ్‌బీ మెయిన్‌రోడ్డు మార్జిన్‌లో ఓ నిద్రగన్నేరు చెట్టు కూలడానికి సిద్ధంగా మెయిన్ రోడ్డు పక్కనే సగం కాలిపోయిన చెట్టు ఉండడంతో ఏ సమయంలో అది కూలుతుందో? తెలియక ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పాలకొల్లు సెంట్రల్: సామాజిక సంక్షేమ శాఖను మాతృ శాఖగా కేటాయించాలని కోరుతూ రాష్ట్ర విద్యా, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఏపి వార్డ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ (ఏపి డబ్ల్యూడబ్ల్యూడీఎస్ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హనీ ప్రవీణ్ అన్నారు. బుధవారం అమరావతిలో మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు స్థానిక విలేకరులకు తెలిపారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి వరద


వలంధర్‌రేవులో గోదావరి నీటిమట్టం కాస్త తగ్గిన దృశ్యం

యలమంచిలి: గోదావరిలో వరద బుధవారం తగ్గుముఖం పట్టింది. అయినా కనకాయలంక కాజ్‌వే మీద వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో కనకాయలంక ప్రజలు ఇంకా పడవ మీదే కాజ్‌వే దాటుతున్నారు. పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ గ్రామాలలో వరద నీరు పూర్తిగా తగ్గింది. అయితే భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతుందని సమాచారం వస్తున్న నేపథ్యంలో గురువారం మళ్లీ వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాజ డ్రెయిన్ పొంగడం వలన ఏనుగువానిలంక పల్లిపాలెం, హరిజనపేటల్లోని ప్రధాన రహదారులు నీట మునిగాయి. దీంతో ప్రజలు వరద నీటిలోనే ప్రయాణిస్తున్నారు. పాఠశాల విద్యార్థులు సైతం వరద నీటిలోనే పాఠశాలకు వెళ్తున్నారు. దీంతో గ్రామ ప్రజలు ఇంజిన్లతో నీరు తోడాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కనకాయలంక, పెదలంక గ్రామాలలో బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యటించారు. వరద సహాయ కార్యక్రమాలపై ప్రజలను ఆరా తీశారు.

నరసాపురంలో

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి నీటిమట్టం తగ్గింది. మంగళవారంతో పోలిస్తే బుధవారం నాటికి అడుగుమేర నీటిమట్టం తగ్గింది. వరద కారణంగా నీట మునిగిన పొన్నపల్లి, లాకుపేట, నందమూరి కాలనీ, స్టేషన్‌పేట, చినమామిడిపల్లి ప్రాంతాల్లో ఇంకా పూర్తిగా నీరు లాగలేదు. ముంపు ప్రాంతాల్లో నీటిని ఇంజిన్‌లతో తోడుతున్నారు. ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నట్లు నరసాపుర ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. పొన్నపల్లి, మధవాయిపాలెం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.


కనకాయలంకలో పడవపై కాజ్‌వే దాటుతున్న ప్రజలు


ఏనుగువానిలంకలో వరద నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కోడేరులో....

పెనుగొండ: ఆచంట మండలంలోని లంకగ్రామాల్లో బుధవారం వరద ఉధృతి మరింత తగ్గుముఖం పట్టింది. వరద ఉధృతి తగ్గడంతో కోడేరు, కరుగోరుమిల్లి, పెదమల్లం, భీమలాపురం గ్రామాల్లో నీటమునిగిన పుష్కర ఘాట్‌లు బయటపడుతున్నాయి. ముంపునకు గురైన గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా, వైరల్ జ్వరాలు విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వరద ముంపునకు గురైన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి తల్లి పాలవారోత్సవాలు

మొగల్తూరు: స్థానిక మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గురువారం నుంచి తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ బి.ఊర్మిల తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ హాజరుకానున్నట్లు వివరించారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

మొగల్తూరు: మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతినెలా అందించే సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 10,733 లబ్దిదారులకు గురువారం ఉదయం 6 గంటల నుంచి వారి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేస్తామని వివరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేగొండి బాలాజీ

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేగొండి బాబాజీ, ప్రధాన కార్యదర్శిగా రంపా పుల్లాజీ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి నల్లిమల్లి జోసఫ్ చెప్పారు. బుధవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. పది పదవులు ఏకగ్రీవం కాగా మిగిలిన పదవులకు ఎన్నిక నిర్వహించారు. గ్రంథాలయ కార్యదర్శిగా నారిన శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా మేడిద శ్రీమంత్, మహిళా ప్రతినిధిగా బొడ్డు ప్రగతి ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం ఏడాది పాటు ఉటుంది. మొత్తం 177 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

వరద బాధితులకు పరామర్శ


మినిమించిలిపాడులో వరిచేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

పోడూరు/పెనుగొండ: వరదల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులు అధైర్యపడవద్దని స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. పోడూరు, మినిమించిలిపాడు, తూర్పుపాలెం గ్రామాల్లో నీటమునిగిన వరిచేలను బుధవారం ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఏడీఏ అడ్డాల పార్వతి, స్థానిక తహశీల్దార్ బీవీ మురళీకృష్ణ, ప్రభుత్వ సిబ్బంది ఉన్నారు. అలాగే ఆచంట మండలంలోని ఆచంట వేమవరం, పెనుమంచిలి, ఆచంట గ్రామాల్లో వరద ఉధృతితో నీట మునిగిన వరిచేలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరిశీలించారు.ఎమ్మెల్యే వెంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, హౌసింగ్ పీడీ జి.పిచ్చియ్య ఉన్నారు.

రోటరీ సేవా శ్రీ అవార్డుల అందజేత

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఏర్పడి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశాఖపట్టణ ఏ1 ఫంక్షన్ హాలులో బుధవారం క్లబ్ పూర్వ అధ్యక్షులను రోటరీ సేవా శ్రీ అవార్డులు అందించి సత్కరించింది. పాలకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు మద్దాల రాంప్రసాద్, చందక రాము, దశిక శేషగిరిరావులను రోటరీ సేవా శ్రీ అవార్డులు రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ప్రదానం చేసి సత్కరించినట్లు క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ విలేకరులకు తెలిపారు. రోటరీ సేవా శ్రీ అవార్డులు అందుకున్న పాలకొల్లుకి చెందిన మాజీ అధ్యక్షులను అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, రోటరీ సభ్యులు పీబీవీ సుబ్బరాజు, కావలి నగేష్ తదితరులు సత్కరించారు.

వరద బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలి


దొడ్డిపట్లలో వరద బాధితులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: ప్రభుత్వం వెంటనే వరద బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. బుధవారం ఆయన దొడ్డిపట్ల మత్స్యకార కాలనీలో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. వారం రోజులుగా దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, కనకాయలంక గ్రామాన్ని వరద చుట్టుముట్టడంతో ప్రజలంతా పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి వరద బాధితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఓదూరి భాస్కరరావు, కల్యాణం గంగాధరరావు, ఓదూరి బాలు, కడిమి బాలరాజు, కడిమి శ్రీరామ్, పెచ్చెట్టి కృష్ణాజీ, ఖండవల్లి వాసు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా మిషన్ శక్తి


మట్టపర్రులో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఆడ పిల్లలను చదివిస్తూ, రక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. మిషన్ శక్తి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో–బేటీ పఢావో, మహిళ శక్తి కార్యక్రమం బుధవారం చించినాడ, పెనుమర్రు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఈ కార్యక్రమం ప్రాధాన్యత వివరించారు. అనంతరం రెండు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

పోడూరు: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.నాగపద్మావతి అన్నారు. మట్టపర్రు యూపీ పాఠశాలలో బుధవారం ‘మిషన్ శక్తి’ 100 రోజుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ‘బేటీ బచావో..బేటీ పడావో..’ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగ పద్మావతి మాట్లాడుతూ బాల్యవివాహాల వచ్చే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.పద్మావతి, కె.బేబి, ఎం.మహాలక్ష్మి, జె.ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


యలమంచిలి: దొడ్డిపట్లలో రోగులకు మందులు అందజేస్తున్న సీహెచ్ ధనలక్ష్మి


పాలకొల్లు అర్బన్: చింతపర్రులో డ్రెయినేజీలో దోమల నివారణకు ఎబేట్ మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

యలమంచిలి: వరదలో ఆరోగ్య సమస్యలతో వచ్చిన వరద బాధితులకు చికిత్స చేయడంతో చూపించిన శ్రద్ధ వరద తరువాత గ్రామాలలో ఎటువంటి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలోనూ చూపించాలని మెడికల్ క్యాంప్స్ జిల్లా నిఘా అధికారి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి కోరారు. వరద బాధితుల కోసం దొడ్డిపట్ల ఏటిగట్టు వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. శిబిరాల్లో ఉన్న మందులు, వరద బాధితులకు అందించిన సేవలు గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రరేఖ, వైద్య సిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత తోనే వ్యాధుల దూరం

పాలకొల్లు అర్బన్: పరిసరాలు పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు అన్నారు. పాలకొల్లు మండలం చింతపర్రులో బుధవారం ఆరోగ్య సిబ్బంది జ్వరాల బారిన పడ్డ వారి వివరాలు నమోదు చేసి వ్యాధిగ్రస్తుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో డ్రెయినేజీలను శుభ్ర పరచి ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు ఎబేట్ మందును స్ప్రే చేయించారు. గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారకసత్య, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

23న లేసుపార్కు ఎన్నికలు



లేసుపార్కు

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద లోని అలంకృతీ లేసు తయారీ మహిళా పరస్పర సహాయ సహకార సంఘాల సమాఖ్య లేసుపార్కులో పనిచేసే బోర్డు ఆఫ్ డైరెక్టర్‌ల పదవీకాలం ముగిసిందని లేసు పార్కు మేనేజర్ కుసుమకుమారి బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. నూతన పాలకవర్గాన్ని ఆగస్టు 23న ఎన్నుకునేందుకు నిర్ణయించామని మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు, వీరవాసరం మండలాల్లో ఉన్న 51 గ్రామస్థాయి సొసైటీలకు సొసైటీ బైలా ప్రకారం బోర్డు ఆఫ్ డైరెక్టర్లను ఎన్నుకుంటారని వివరించారు. వారు నుంచి లేసుపార్కు బోర్డు ఆఫ్ డైరెక్టర్‌లను ఎన్నుకునేందుకు తీర్మానించినట్లు లేసుపార్కు మేనేజర్ తెలిపారు.